ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
5
ఆదివారం, 19 మే 2024



ప్రజల చెంతకు
మంత్రి పొంగులేటి
నేడు ఖమ్మం రూరల్‌లో పర్యటన
6



రేపు ఇల్లెందుకు
కేటీఆర్ రాక
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
6



నేడు సీపీఎం నేత
శైలజ రాక
ఖానాపురం హవేలీలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం
6

ఆస్తి కోసం
కిరాతకం
తల్లి, ఇద్దరు పిల్లలను హత్యచేసిన కసాయి

- నమ్మించి వచ్చి, ప్రాణాలు తీసి పరార్
- రెండేళ్ల క్రితం మొదటి భార్య అనుమానాస్పద మృతి
- తల్లాడ మండలం గోపాలపేటలో దారుణం
- పోలీసుల అదుపులో నిందితుడు



పిచ్చమ్మ నీరజ ఝాన్సీమోహిని



నిందితుడు పిట్టల వెంకటేశ్వర్లు

తల్లాడ, మే 18: ఆస్తి కోసం అతడు కిరాతకుడయ్యాడు.. రక్త సంబంధాన్ని మరిచి నరరూప రాక్షసుడిగా మారాడు.. జన్మనిచ్చిన తల్లిని, నెత్తురు పంచుకొని పుట్టిన ఇద్దరు బిడ్డలను చేతులారా కడతేర్చాడు.. ఆత్మీయత, అనుబంధం అనే పదాలకు అర్థాన్నే మార్చేశాడు.. అత్యంత హేయమైన ఈ ఘటన తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పిట్టల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పాల్పడిన ఈ దారుణ ఘటనలో తల్లి పిట్టల పిచ్చమ్మ(60), కుమార్తెలు నీరజ(11), ఝాన్సీమోహిని(6) ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్లితే..

గోపాలపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పిట్టల వెంకటేశ్వర్లుకు 13ఏళ్ల క్రితం రంగంబంజర గ్రామానికి చెందిన కనకదుర్గతో వివాహమైంది. వీరికి నీరజ, ఝాన్సీమోహిని అనే ఇద్దరు కుమార్తెలున్నారు. 2022 మే 31న కనకదుర్గ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనపై వెంకటేశ్వర్లుపై పోలీసులకు ఫిర్యాదు రావడంతో.. తల్లి పిచ్చమ్మ పేర అరెకరం భూమి, కుమార్తెలు నీరజ, ఝాన్సీమోహిని పేర చెరో 15 గుంటల వ్యవసాయ

(మిగతా 6వ పేజీలో)



‘కలెక్షన్..’
కనెక్షన్..

- ముడుపులు ఇస్తేనే రైతులకు వ్యవసాయ విద్యుత్ మోటర్లు
- ఒక్కో కనెక్షన్‌కు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు
- ఇప్పటివరకు పెండింగ్‌లో 838 విద్యుత్ వ్యవసాయ మోటర్లు
- విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారుల తీరుతో రైతుల అరిగోస
- మీసేవ కేంద్రాల్లో రైతుల పేరుతో ఉద్యోగుల దందా
- అశ్వారావుపేట ఏఈ ఏసీబీకి పట్టుబడటమే అవినీతికి నిదర్శనం

6

ఎల్‌డబ్ల్యూఈ రోడ్ల పనులకు అనుమతివ్వండి..
అటవీశాఖ అధికారులకు మంత్రి తుమ్మల సూచన
6

కలెక్షన్.. కనెక్షన్..

- ముడుపులు ఇస్తేనే రైతులకు వ్యవసాయ విద్యుత్ మోటర్
- ఒక్కో కనెక్షన్‌కు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు
- ఇప్పటివరకు పెండింగ్‌లో 838 విద్యుత్ వ్యవసాయ మోటర్లు
- ఎన్నెస్పీ కాల్వ పరిధిలోనూ రైతుల దరఖాస్తులు
- విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారుల తీరుతో రైతుల అరిగోస
- మీసేవ కేంద్రాల్లో రైతుల పేరుతో ఉద్యోగుల దందా
- అశ్వారావుపేట ఏఈ ఏసీబీకి పట్టుబడటమే అవినీతికి నిదర్శనం



పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ మోటర్ల పనులు

డివిజను	పెండింగ్ పనులు
ఖమ్మం	379
ఖమ్మంరూరల్	148
సత్తుపల్లి	224
వైరా	87

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు విద్యుత్ వరాల సబ్సిడీల జల్లు కురిపించినా విద్యుత్ శాక క్షేత్రస్థాయిలోని ఇంజనీరింగ్ అధికారులు చేతులు తడపనిదే రైతులకు విద్యుత్ పథకాల పనులు ముందుకు వెళ్లటం లేదు. ముఖ్యంగా రైతులకు వ్యవసాయ విద్యుత్ మోటర్లు ఏర్పాటుపై గత పదేళ్ల కాలంలో అనేక మార్పులు చేశారు. రైతులు వ్యవసాయ విద్యుత్ మోటర్ కోసం డీడీ తీసిన తర్వాత నిర్ణీత కాలపరిమితి లోపుగా కనెక్షన్ ఇవ్వాలనే నిబంధనలు ఏర్పాటు చేసి వాటిని కచ్చితంగా అమలు చేసేలా సీఎండీ స్థాయి నుంచి ప్రతి నెల రివ్యూలు చేస్తున్నారు. రైతులు డీడీలు తీసిన తర్వాత 30రోజులు లోపుగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతుంది. విద్యుత్‌శాఖలో దళారులుగా మారిన ఉద్యోగులు రైతుల పేరుతో మీ సేవా కేంద్రల్లో దరఖాస్తులు చేసి అలా దరఖాస్తులు శాఖ ద్వారా వచ్చిన మంజూరు జరిగిన తర్వాత త్వరగా ఎస్టిమేట్లు వేయించి చకా చకా పనులు పూర్తి చేసి ఒక్కో వ్యవసాయ విద్యుత్ మోటరుకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు రైతుల నుంచి అదనంగా పిండుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. డబ్బులు చెల్లించుకోలేని రైతుల వ్యవసాయ మీటర్లు మాత్రం ఏళ్ల తరబడి జాప్యానికి గురైతున్నాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే మొత్తం 1,614 రైతుల వ్యవసాయ మోటర్లు పెండింగ్‌లో ఉన్నాయి వాటిలో గడువు దాటిన స్విచ్ ఆన్ ఆన్ కానీ మీటర్లు 838 పెండింగ్‌లో ఉన్నాయి.

ఎన్ఎస్పీ కాల్వ పరిధిలో..

ఖమ్మం జిల్లాలో సాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల నుంచి వ్యవసాయ విద్యుత్ మోటర్లు కోసం రైతులు దరఖాస్తు చేస్తుంటారు. ప్రతి ఏడాది జిల్లాలో 3వేల నుంచి 3,100 వరకు నూతన వ్యవసాయ కనెక్షన్‌లు అందిస్తుంటారు. అయితే ఈ సంవత్సరం నాగార్జున్ సాగర్ కాల్వ పరిధిలో సాగు నీటి ఎద్దడి ఉందని భావించిన రైతులు ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ మోటర్లు కోసం దరఖాస్తులు చేశారు. దీంతో అదనంగా జిల్లాలో మరో 300 నూతన కనెక్షన్‌లకు డిమాండ్ పెరిగింది.

అవినీతికి సాక్ష్యాలు...

అశ్వారావుపేటలో ఓ రైతు నుంచి రూ.1లక్ష లంచం తీసుకుంటూ విద్యుత్ ఇంజనీరింగ్ అధికారి ఏసీబీకి చిక్కాడు. రాష్ట్ర స్థాయిలోనే విద్యుత్‌శాఖలో అశ్వారావుపేట అవినీతి సంఘటన మచ్చగా ఉమ్మడి జిల్లాకు మిగిలింది. గతంలో విద్యుత్ మీటర్లు నుంచి అనేక అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైన ఇంజనీరింగ్ అధికారులు తర్వాత కాలంలో పైరవీలు చేయించుకొని ఇదే ఉమ్మడి జిల్లాలో తిరిగి పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాతా వారు మారడం లేదు. గ్రామస్థాయిలో పనిచేసే లైన్ మ్యాన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లను అవినీతి కంపులోకి దించుతున్నారు.

రూ.70వేల సబ్సిడీ

రైతులు వ్యవసాయ విద్యుత్‌కు విద్యుత్ నీటి అవసరాల దృష్ట్యా 5హెచ్‌పీ, 10హెచ్‌పీ విద్యుత్ మోటర్లును కోరుకుంటారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ మందిరైతులు 5హెచ్‌పీ మోటర్లు వాడుతుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం 10హెచ్‌పీ విద్యుత్ మోటర్లు వినియోగిస్తున్నారు. ఒక రైతు 5హెచ్‌పీ విద్యుత్ మోటరు కోసం మీ సేవా కేంద్రానికి ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పట్టాపాసుపుస్తకం జీరాక్స్ తీసుకెళ్లి రూ.5,350 చెలిస్తే ఆ రైతు పేరుతో విద్యుత్ మోటరు మంజూరవుతుంది. రైతులు చెల్లించిన రూ.5,350కు ప్రభుత్వం రూ.70వేలకు పైగా సబ్సిడీ చెల్లించి రైతులకు వ్యవసాయ మోటార్లు ఏర్పాటు చేస్తోంది. 10హెచ్‌పీ మోటరుకు మాత్రం రూ.10,700ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రైతులకు వ్యవసాయ మోటర్లు దరఖాస్తులు పూర్తి జరిగినతర్వాత ఏఈ వచ్చి లైన్ఎస్టేమెట్ వేస్తారు. డీఈ స్థాయిలో మంజూరు చేస్తారు. తర్వాత టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తారు. రైతు వద్ద నుంచి పైసా వసూళ్లు చేయకుండా లైన్ లాగటం నుంచి ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఏర్పాటు, విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌పోర్టు వరకు విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్ నిర్వహించాల్సి ఉంటుంది.

ఆది నుంచి అవినీతే

రైతులు మీసేవ ద్వారా దరఖాస్తులు చేస్తే త్వరగా మోటర్లు మంజూరు కావటం లేదని విద్యుత్ శాఖ ఉద్యోగులే మీ సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రైతుల పేరుతో దరఖాస్తులు చేస్తున్నారు. మీసేవలో 5హెచ్‌పీ మోటరుకు చెల్లించాల్సిన రూ.5,350కుగాను రూ.10వేలు తీసుకుంటున్నారు. ఇక 10హెచ్‌పీ మోటరుకు రూ.15వేలకు పైగా రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. విద్యుత్‌శాఖ నిబంధనల మేరకు మీ సేవా ద్వారా మంజూరైన వ్యవసాయ విద్యుత్ పనులను మండల స్థాయిలో దరఖాస్తులు సీనియార్టీ ప్రకారం పనులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఎక్కువ డబ్బులు ఇచ్చిన రైతులు, మీసేవలో విద్యుత్ ఉద్యోగులు ద్వారా దరఖాస్తులు చేసిన వ్యవసాయ మోటర్లు ఏర్పాటు పనులు ముందుగా చేస్తున్నారు. పనులైన తర్వాత తిరిగి అదనంగా రూ.25వేల నుంచి రూ.30వేల వరకు రైతుల్ని పిండుతున్నారు. ఇక గద్దెలను సైతం రైతులే నిర్మించుకునేలా చేస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. విద్యుత్ స్తంభాల తరలింపును రైతులే చేపడ్తున్నారని విమర్శలు ఉన్నాయి. నేరుగా మీసేవా కేంద్రాలకు వెళ్లి స్వతంత్రంగా వ్యవసాయ మీటర్లు కోసం దరఖాస్తులు చేసిన రైతులకు విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. పైసలు ఇవ్వలేని రైతుల పనులకు ఎస్టిమేట్‌లు అధికంగా చూపిస్తున్నారు. సర్వీస్ లైన్ చార్జీలు అధికంగా రికార్డు చేస్తున్నారు. ప్రశ్నించిన రైతుల విద్యుత్ మోటర్లు ఏళ్ల తరబడి నిలిచిపోతున్నాయి.

సస్పెండైనా మారని తీరు

వారం రోజుల క్రితమే ఖమ్మం టౌన్ 4ఏఈ సస్పెండ్ అయ్యారు. ఇదే అధికారి గతంలో ఖమ్మం అర్బన్ సెక్షన్‌లో పనిచేస్తూ మీటర్లు వర్క్ ఆర్డర్‌పై అవినీతి నిరూపణ కావటంతో శాఖాపరంగా అవినీతి నిరూపణ కావటంతో ఆరేళ్ల క్రితం సస్పెన్షన్ చేశారు. అయినా తిరిగి ఖమ్మంనగరంలోని ఉద్యోగం కల్పించారు. తిరిగి అవినీతి కారణంతోనే రెండో సారి సస్పెన్షన్ వేటు పడింది. అశ్వారావుపేటలో ఏసీబీకి పట్టుబడిన అధికారి గతంలో మధిరలో మీటర్లు అవినీతిపై సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇదే అధికారి ఏన్కూరులో పలు ఆరోపణలు ఎదుర్కొవటంతో ఇంక్రిమెంట్లు కోల్పోయారు. పలుకుబడితో అవినీతికి పాల్పడిన ఇంజనీరింగ్ అధికారులు కనీసం ఉమ్మడి ఖమ్మం జిల్లా దాటటం లేదు.

పెండింగ్ విద్యుత్ మోటర్లు ఇలా..

ఖమ్మం జిల్లాలో మొత్తం 1614 పెండింగ్‌లో వ్యవసాయ విద్యుత్ మోటర్లు ఉన్నాయి. వీటిలో తక్షణమే కనెన్షన్‌లు అందించే స్థాయిలో 11, ఎస్టీమేషన్ పూర్తి చేసినవి 1249, ఎస్టీమేషన్ నమోదు చేయాల్సినవి 354 ఉన్నాయి. ఇక నెలల తరబడి నిరీక్షిస్తున్న వ్యవసాయ మోటర్లు 838కు చేరాయి.

ఎల్‌డబ్ల్యూఈ రోడ్ల పనులకు
అనుమతివ్వండి..

- అటవీశాఖ అధికారులకు మంత్రి తుమ్మల సూచన



ఖమ్మం, మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఈ-లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం) ప్రభావిత ప్రాంతాల్లో ఫేజ్- 1, ఫేజ్-3తోపాటు 2018-19, ఎస్‌సీఏ స్కీం కింద ప్రారంభించబడి అటవీ అనుమతులు రాక ఆగిపోయిన రోడ్లను పూర్తిచేయడానికి సత్వర అనుమతులు మంజూరు చేయాలని అటవీశాఖ మంత్రి, పీసీసీఎఫ్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. వీటిలో గుండాల-పస్రా, వీరాపురం-గుండాల, పెద్దమిసిలేరు-బత్తినపల్లి రాయన్నగూడెం వయా పూసుకుంట, ఆళ్లపల్లి-వెంకటాపురం, లక్ష్మీనగర్-లక్ష్మీపురం, అడవిరామవరం-చొంగతోగు, సాయినపల్లి-అడవిరామవరం, మర్కోడు-అడవిరామవరం, ఎర్రంపాడు-ఆర్‌సీపురం, దేవరపల్లి-కొరకటపాడు, కొరకటపాడు-బక్కచింతలపాడు, కొత్తపల్లి-గద్దెమడుగు, కిష్టాపురం-పిట్టతోగు, కుర్నవల్లి-నిమ్మలగూడెం, బత్తినపల్లి-కురుమపల్లి, బోడబల్లి-దోకుపాడు, ముల్కలపల్లి-ఆర్లపెంట, పుసుగుప్ప-సీఎస్ బార్డర్, బత్తినపల్లి-తిప్పాపురం, బత్తినపల్లి-చెన్నాపురం, కలివేరు-చెన్నాపురం, పైడగూడెం-కొత్తూరు, ఉయ్యాలమడుగు-తిప్పాపురం, తాలిపేరుడాం-రాళ్లపురం రోడ్, రాళ్లపురం-బట్టిగూడెం, తిప్పాపురం-బట్టిగూడం, ఎర్రంపాడు-బట్టిగూడెం బీటీ రోడ్ల నిర్మాణాలు అటవీ అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి అనుమతులు ఇస్తే రోడ్లు పూర్తి చేసి వాడకంలోకి తెచ్చినట్టయితే రవాణ సౌకర్యాలు మెరుగుపరవచ్చని ఆ దిశగా వెంటనే కావాల్సిన అనుమతులు మంజూరు చేయాల్సిందిగా మంత్రి కోరారు.

20న ఇల్లెందుకు కేటీఆర్

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఇల్లెందు, మే 18: నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఇల్లెందు పట్టణంలో సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రచార సభలో పల్గొంటారని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ తెలిపారు. ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో జరగనున్న పట్టభద్రులు, బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశంలో కేటీఆర్ ప్రసంగిస్తారని పట్టభద్రులు అధిక సంఖ్యలో సభలో పాల్గొనాలని హరిప్రియ కోరారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్, మే 18: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. రెడ్డిపల్లి మారెమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లోకి వెళ్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో ప్రజలతో స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. మండలంలోని పల్లెగూడెం, పోలేపల్లి, గోళ్లపాడు, తీర్థాల, మద్దివారిగూడెం, పోలిశెట్టిగూడెం, మంగళగూడెం, గుండాల తండా, తనగంపాడు, గూడూరుపాడు, యం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, కస్నాతండా, రేగుల తండా, ఆరెకోడుతండా, చింతపల్లి, ఆరెకోడు, ముత్తగూడెం తదితర గ్రామాల్లో మంత్రి పర్యటించనున్నట్టు తెలిపారు.

నేడు సీపీఎం నేత శైలజ రాక

- ఖానాపురం హవేలీలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం



సీపీఎం ఖానాపురం హవేలీ కార్యాలయం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 18: సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు, కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే కేకే శైలజ ఆదివారం ఖమ్మం రానున్నారు. 2000వ సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో నగరంలోని ఖానాపురం హవేలిలో నిర్మించిన సీపీఎం కార్యాలయాన్ని ఆమె ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం జిల్లా పార్టీ కార్యాలయం సుందరయ్య భవన్‌కు చేరుకున్న అనంతరం అక్కడి నుంచి ఖానాపురంహవేలి వరకు జరిగే రెడ్‌షర్టు కవాతులో పాల్గొంటారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆమె ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఆస్తి కోసం కిరాతకం

(5వ పేజీ తరువాయి)

భూమి, డబుల్‌బెడ్‌రూం ఇంటిని పెద్దల సమక్షంలో రాయించారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు తల్లాడకు చెందిన త్రివేణి అనే మహిళను రెండో పెళ్లి చేసుకొని ఇంటినుంచి వెళ్లిపోయాడు. దీంతో వెంకటేశ్వర్లు తల్లి పిచ్చమ్మ అతని కుమార్తెలు నీరజ, ఝాన్సీమోహినితో కలిసి గోపాలపేటలోనే నివాసముంటున్నారు. పిచ్చమ్మ ఇద్దరు మనుమరాళ్ల బాగోగులు చూసుకుంటూ జీవనం గడుపుతోంది. రెండో వివాహం చేసుకున్న తర్వాత వెంకటేశ్వర్లు అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు తల్లి పిచ్చమ్మ పేర ఉన్న అరెకరం పొలం అమ్మడానికి ప్రయత్నించాడు. అందుకు పిచ్చమ్మ అంగీకరించకపోవడంతో తల్లి, ఇద్దరు కూతుళ్లను అడ్డు తొలగించుకోవాలని కక్ష పెంచుకున్నాడు. ముగ్గురిని చంపితే ఆస్తి మొత్తం తనకే చెందుతుందని భావించాడు.

ఇంటికి వస్తున్నానని చెప్పి...

వెంకటేశ్వర్లు.. శుక్రవారం రాత్రి సుమారు 8.30గంటల సమయంలో గోపాలపేటలో తన ఇంటి పొరుగున ఉండే గోగుల జానకమ్మకు ఫోన్ చేసి తన తల్లితో మాట్లాడించమన్నాడు. తల్లి పిచ్చమ్మ, పెద్ద కుమార్తె నీరజలతో ఫోన్ మాట్లాడి తాను ఖమ్మం నుంచి వస్తున్నానని చెప్పాడు. కొడుకు వస్తున్నాడని తల్లి, నాన్న వస్తున్నాడని పిల్లలు సంతోషపడ్డారు. అయితే రాత్రి వెంకటేశ్వర్లు ఎప్పుడు వచ్చాడో.. ఏం చేశాడో.. తెలియదుగానీ, తెల్లారే సరికల్లా రేకుల కింద తిరగవేసిన మంచంపై పిచ్చమ్మ, నీరజ, ఝాన్సీ మోహిని విగతజీవులుగా పడి ఉన్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామున ఐదు గంటలకే నిద్రలేచే పిచ్చమ్మ కనిపించకపోవడంతో ఇంటి ఎదురుగా ఉన్న కోటమ్మ, కన్నమ్మ అనే మహిళలు వెళ్లి చూడగా పిచ్చమ్మ మనవరాళ్లతో సహా చనిపోయి కనిపించింది. ముగ్గురి గొంతు, ముఖం, శరీరభాగాలపై గాయాల ఆనవాళ్ల ఉండగా, నీరజ నోటి నుంచి నురగ ఉంది.

రాత్రి ఏం జరిగింది...?

శుక్రవారం రాత్రి వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చిన తర్వాత ఏం జరిగింది అనేది అంతుబట్టడం లేదు. ఆస్తిని కాజేయాలనే ప్లాన్‌తో ఉన్న వెంకటేశ్వర్లు పథకం ప్రకారమే తల్లి, ఇద్దరు పిల్లలను కడతేర్చినట్టు భావిస్తున్నారు. కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి ముగ్గురూ స్పృహ కోల్పోయిన తర్వాత దిండుతో ఊపి రాడకుండా చేసి చంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముగ్గురు చనిపోయారని నిర్ధారించుకున్న తర్వాత వారిని తిరగేసిన మంచంపై పడుకోబెట్టి పరారయ్యాడు. వెంకటేశ్వర్లు కసాయిచర్య వెనుక రెండో భార్య త్రివేణి ప్రోద్బలం ఉన్నట్టు అనుమానిస్తున్నారు. వాళ్లు చనిపోతే ఆస్తి అంతా తమకే చెందుతుందని భావించే ఈ చర్యకు పాల్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. సంఘటనాస్థలాన్ని వైరా ఏసీపీ ఎంఏ రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్‌లు పరిశీలించారు. వెంకటేశ్వర్లు బామ్మర్ది కె.మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు తల్లాడ ఏఎస్ఐ జేవీఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను శవపరీక్ష కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

నానమ్మ, చెల్లిని చూడాలని వచ్చి...

గోపాలపేట ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి పూర్తయిన నీరజ వేసవి సెలవులు కావడంతో కల్లూరు మండలం లోకారంలోని చిన్నతాతయ్య ఇంటికి వెళ్లింది. నానమ్మ పిచ్చమ్మ, చెల్లి ఝాన్సీమోహినిలను చూడాలనిపించి మూడురోజుల క్రితమే లోకారం నుంచి గోపాలపేటలోని ఇంటికి వచ్చింది. శనివారం గోపాలపేటలో సమీప బంధువు కొన్నెబోయిన రాములు పెద్దకర్మ ఉందని, తాము అక్కడికి వెళ్లేది ఉందని, కలిసి వెళ్దామని తాత చెప్పినప్పటికీ, నీరజ వినకుండా నానమ్మ ఇంటికి వచ్చి ప్రాణాలు కోల్పోయింది. చదువులో ప్రతిభావంతురాలైన నీరజ కల్లూరులోని గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశానికి అర్హత సాధించింది.



దమ్మపేటలో మాట్లాడుతున్న దేవయ్యపటేల్

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

- సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్యపటేల్

అశ్వారావుపేట/ దమ్మపేట, మే 18: మున్నూరుకాపులు రాజకీయంగా ప్రాధాన్యం పెంచుకోవాలని, ఆదిశగా అందరూ అడుగులు వేయాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చైతన్యయాత్రలో భాగంగా శనివారం ఆయన అశ్వారావుపేట, దమ్మపేటలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశాల్లో మాట్లాడారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మున్నూరుకాపులకు రేవంత్‌రెడ్డి సర్కార్ కార్పొరేషన్ ప్రకటించడంపట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికలలో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, చైర్మన్ పదవులకు పోటీ చేసేలా ప్రాధాన్య చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. మండల నాయకత్వాలు ఆదిశగ కృషిని ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం కార్పొరేషన్‌కు వెయ్యికోట్లు నిధులు కేటాయించాలని కోరారు. అవకాశం ఉన్న ప్రతిచోట పోటీ చేయాలని కోరారు. విద్య, వ్యవసాయం నైపుణ్యాభివృద్ధి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లా ప్రసాదరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు యూఎస్ ప్రకాశరావు, వాసం వెంకటేశ్వర్లు, చిన్నంశెట్టి సత్యనారాయణ, యుగంధర్, కోరుకొండ భాస్కరరావు, పగడాల రాంబాబు, ఆది కోటేశ్వరరావు, లంకా నర్సింహారావు, నకుల్, తాడేపల్లి రవి, నాగబాబు, కట్టా శ్రీను, మద్దా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూం భద్రతపై రాజీ వద్దు

- వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ వీపీ గౌతమ్



స్ట్రాంగ్‌రూం పై కప్పును పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్/ ఖమ్మం రూరల్, మే 18: ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలను ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈవీఎంల భద్రతకు అన్ని జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న వెంటిలేటర్, కిటికీలను ఇటుకలతో మూసివేయాలన్నారు. వర్షపు జల్లులు లోనికి రాకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూంల భవనంపై స్లాబ్ ను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎల్ఇడి స్క్రీన్ పై 7 సెగ్మెంట్లు, పోస్టల్ బ్యాలెట్ల స్ట్రాంగ్ రూంల వ్యూను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యామ్ ప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, ఆర్అండ్‌బీ ఏఈఈ విశ్వనాథ్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీవో రాజారావు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీటీ శివకుమార్

కరకగూడెం, మే 18: మండల వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు తాము కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిశాయి. రైతులు తడిసిన ధాన్యం ఆరబోశారు. దాంతో అకాల వర్షం.. అపార నష్టం అనే కథనం శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాల మేరకు శనివారం డీటీ శివకుమార్, జీసీసీ మేనేజర్ దావిద్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పలు గ్రామాల్లో తడిసిన ధాన్యంను పరిశీలించారు. ఈ సందర్భంగా డీటీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు కంటా పెట్టిన ధాన్యం బస్తాలను ఎగుమతి చేస్తామని, రైతులు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుక రావాలని తెలిపారు. కరకగూడెం జీసీసీ కేంద్రంలో ఉన్న ధాన్యం బస్తాలు లోడ్‌కు సరిపడ లేవని లోడ్‌కు సరిపోను బస్తాలు అయిన వెంటనే లారీకి లోడ్ చేసి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో చిరుజల్లులు

- కల్లూరులో 1.5సెం.మీ. వర్షపాతం
- మధిర మండలంలో పిడుగుపడి రైతు మృతి

ఖమ్మం కార్పొరేషన్, మే18: ఖమ్మం జిల్లాలో శనివారం చిరుజల్లులు పడ్డాయి. అత్యధికంగా కల్లూరులో 1.5సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మధిర మండలం రామచంద్రాపురంలో పిడుగుపాటుకు రైతు సంపసాల కృష్ణ మృతిచెందాడు. జిల్లాలో పలుప్రాంతాల్లో ఉదయం నుంచే వర్షం కురిసింది. తరువాత కొంత విరామ తరువాత సాయంత్రం మళ్లీ వర్షం కురిసింది. జిల్లాలోని కల్లూరులో అత్యధికంగా వర్షం కురవగా, తిరుమలాయపాలెం, మధిర, బోనకల్, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, ముదిగొండ, వైరా, కూసుమంచి, నేలకొండపల్లి, తల్లాడలలో ఒక మోస్తరు వర్షం కురిసింది. మధిర మండలం రామచంద్రాపురంలో పొలం వద్దకు తన గేదెలను మేపేందుకు సంపసాల కృష్ణ అనే రైతు శనివారం సాయంత్రం వెళ్లాడు. ఆ సమయంలో వర్షం కురవటంతో చెట్టు కిందకు వెళ్లాడు. అక్కడ పిడుగుపడటంతో మృతిచెందాడు.



జీఎంకు వినతిపత్రం సమర్పించిన నాయకులు

సింగరేణి అధికారి ఆత్మహత్యపై

సమగ్ర విచారణకు డిమాండ్

ఇల్లెందు, మే 18: సింగరేణి అధికారుల పట్ల క్షేత్రస్థాయిలో వేధింపులు జరుగుతున్నాయని సింగరేణి కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోషియేషన్స్ ఇల్లెందు ఏరియా అధ్యక్షుడు శివ ప్రసాద్ విమర్శించారు. సింగరేణిలో విజిలెన్స్ అధికారుల వేధింపులు క్షేత్ర స్థాయిలో పని ఒత్తిడి మూలంగా మంచిర్యాల ఏరియా సింగరేణి పవర్ ప్లాంట్‌లో సూపరింటెండెంట్ ఇంజనీర్ కిరీటి ఈ నెల 17న ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో క్షేత్రస్థాయిలో అధికారులపై పనిభారం పెరిగిందని అన్నారు. కార్మికులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు విస్మరించారని అన్నారు. అధికారుల పట్ల పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కిరీటి కుటుంబాన్ని ఆదుకోవాలని, బాధ్యులను శిక్షించాలని శనివారం ఇల్లెందు సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, చిన్నయ్య, మధుసుదన్ రావు, పవన్, నాగేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో అధికారులు శ్రమించాలి

- జడ్పీ చైర్మన్ కంచర్ల, ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, మే 18: ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని జిల్లా ప్రజాప్రజాపరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం జిల్లా జడ్పీ సర్వసభ్య సమవేశం కొత్తగూడెంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ కంచర్ల మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం పరిపాలనలో లోపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. శాసనమండలి సభ్యుడు ఆలుగుబెల్లి నర్సింరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసేందుకు ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు సమావేశానికి ముందు ఇటీవల ఎన్నికల విధుల్లో మృతి చెందిన జడ్పీఉద్యోగి శ్రీకృష్ణ మృతికి సంతాపం ప్రకటించారు. ఈ సమావేవంలో జడ్పీ సీఈవో ప్రసూనరాణి, డిప్యూటి సీఈవో కే. వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, జిల్లా వైద్యశాఖ అధికారి శిరీష, జడ్పీటీసీలు పైడి వెంకటేశ్వర్లు, బరపాటి వాసుదేవరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

కొత్తగూడెం, (ఆంధ్రజ్యోతి)/ ఖమ్మం కలెక్టరేట్, మే 18: వరంగల్ - ఖమ్మం - నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీవోలు, నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో పోలింగ్ అధికారుల నియామకం, ఏర్పాట్లు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాసనమండల పట్టభద్రుత ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 17న కౌంటింగ్ జూన్ 5న ఉన్నట్లు తెలిపారు. రూట్ల ఏర్పాటుకు కార్యచరణ చేసి రవాణా ప్రణాళిక చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను సుజావుగా నిర్వహించాలి

శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఖమ్మం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ కోరారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ, అసెంబ్లీ సెగ్మెంట్ల మాస్టర్ శిక్షకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో న్యూవిజన్ అగ్రగామి


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ ప్రసాద్

ఖమ్మం ఖానాపురంహవేలి మే 18: ఎప్సెట్ - 2024 ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎప్సెట్ 2024 - పోటీ పరీక్షలో నగరంలో న్యూ విజన్ జూనియర్ కళాశాల ర్యాంకులు ప్రభంజనాన్ని సృష్టించిందని, రాష్ట్రస్థాయిలో 102, 157, 231, 245, 409, 465, 492, 563, 625, 739, 853, 883 వంటి మరెన్నో ఉత్తమ ర్యాంకులతో జిల్లాలోనే నంబర్ వన్ స్థాయిలోనే కాక రాష్ట్రస్థాయిలోనూ నెంబర్ వన్ కళాశాలగా న్యూ విజన్ నిల్చిందని కళాశాల చైర్మన్ సీహెచ్.జి.కె. ప్రసాద్ తెలిపారు. కళాశాల నుంచి ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో మహస్వీ 102, జి. శ్రీరాం 157, ఎస్. రుషిధర్‌రెడ్డి 231, కె. వర్షిత్ 245, ఎం. నితీష్‌కుమార్ 409, పి. సుష్మిత 465, జి. సాయిలిఖిత్ 492, ఎండి సమీన్ 563, పి. రేవంత్ 625, ఎం. పవన్‌కుమార్ 739, పి. గోవర్ధన్ సాయి 853, బి. ప్రభంజన్ జదేవ్ 883, సీహెచ్. నయన్ 1,179, వై. ప్రశాంతి 1,245, సీహెచ్ భవన 1,322, వంటి మరెన్నో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంజనీరింగ్ , అగ్రికల్చర్ విభాగం నుంచి 550 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 10,000 లోపు 86 మంది విద్యార్థులు ర్యాం కులు సాధించారని తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో 395వ ర్యాంకు 99.9833112 ఉత్తమ పర్సంటైల్‌తో ఆలిండియా ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్. జి.కె. ప్రసాద్, డైరక్టర్ సీహెచ్. గోపిచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్. కార్తిక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు అధ్యాపకబృందం విద్యార్థుల ను పొల్గొని అభినందించారు.

యాజమాన్యం కృషితోనే రాష్ట్ర స్థాయి 102వ ర్యాంక్

● విద్యార్థి మహస్వీ


విద్యార్థి మహస్వీని అభినందిస్తున్న చైర్మన్ ప్రసాద్

ఎప్‌సెట్ 2024 ఫలితాల్లో 102 వ ర్యాంక్ రావటానికి ముఖ్య కారణం న్యూవిజన్ కళాశాల. యాజమాన్యం విద్యా బోధన వల్లే రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించాను. న్యూవిజన్ పాఠశాలలో చదివి 10కి 10 పర్సంటైల్ సాధించాను. మా నాన్న బాస్కర్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి మాధవి గృహిణి. జేఈఈ మెయిన్స్‌లో 99.9698 సాధించటం జరిగింది. ఈ ర్యాంకులు రావడానికి ముఖ్య కారణం తల్లితండ్రుల సహకారం, న్యూవిజన్ విద్యా సంస్థల విద్యాబోధనే కారణం. భవిష్యత్తులో శాస్త్రవేత్త కావాలన్నదే నాకోరిక. అందుకు తగ్గట్టుగానే ముందు నుంచి శిక్షణ తీసుకుంటున్నాను.

కృష్ణవేణి విజయదుందుబి


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 18: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి, ఐఐటి, మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో విజయఢంక మోగించారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, మాచవరపు కోలేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావులు తెలిపారు. ఎన్. భరత్‌తేజ 162, సీహెచ్. భరత్ వంశీ 862, కె. స్వాతి 1,260, వై. గీత 1,352, ఏ. ఇందు 4,158, ఎండి. మోహెక్ తబస్సుమ్ 4,380, సీహెచ్. లక్ష్మి 5,788, టి. కోమలి 6,686, వై. ఉమేష్‌చంద్ర 7,021, వి. శ్రీహిత 7,045, జి. సాయి సైనిక 7,484, పి నవదీప్ 7,657, కె. హరిప్రియ 7,928, బి . మెర్సీ 8,087, టి. వర్ష 8,108, కె. ఆశ్రిత 8,967, జి. దీప్తి 9,762, వి. దేవిప్రియా 9,828, బి. గణేష్ 9,981 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రుల ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇన్‌చార్జి వంశీకృష్ణ, ఏవో నిరంజన్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ప్రభంజనం


విద్యార్థులతో విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం ఖానాపురంహవేలి మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి విజయదుందుబి మోగించారని విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. కళాశాలకు చెందిన పి. సాయి దినేష్‌రెడ్డి 188వ ర్యాంక్ సాధించి రాష్ట్ర స్థాయిలో నిలిచాడని తెలిపారు. జి. అక్షయ్ రెడ్డి 215, వై. తుషార్‌చౌదరి 297, ఎస్. వర్షిత్ కౌండిన్య 321, టి. శ్రీరాంతేజ 348, కె. నవదీప్‌కిరణ్ 351, ఎస్. సాత్విక్ 387, కె .మణిదీప్ 423, డి. శ్రీ సాత్విక్ 457, డి. సింధు 481, జి. మనోహర్ 506, బి. నాగశ్రీ 517, బి. మధు 528, సీహెచ్. సంజయ్ 663, ఎస్కే. నసీమ్ 731, బి. అబిలాష్ 736, ఆర్. కౌషిక్‌రెడ్డి 816, టి. రోహిణి 931, సీహెచ్. సహిస్నా మిహోర్ 1,130, పి. బ్రమని 1,251, వి. సందీప్ 1284, ఎస్కే. జాన్‌బీ 1296తోపాటు మరేందరో విద్యార్థులు 2వేల లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతిభ సాధించిన అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ సాయిగీతిక, సిహెచ్ చేతన్‌మాధుర్ డి. వర్మ, సీహెచ్. బ్రహ్మం, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్ట్ హవా


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి మంచి ర్యాంకులు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపారు. తమ కళాశాల నుంచి ఇంజనీరింగ్ విద్యకుగానూ 175 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, కె.ప్రణయ్ సంజన్ 684వ ర్యాంకు సాధించి కళాశాల అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. జి.చిన్మయి 695వ ర్యాంకు, వి.జస్వంత్ 723వ ర్యాంకు, జి.రాజ్‌వర్ధన్ 900వ ర్యాంకు, ఎన్.అనీష్ 1156వ ర్యాంకు, ఆర్. సాయి సంజయ్ 1197వ ర్యాంకు, వి.విష్ణుతేజ 1483 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఎంపీసీ విభాగంలో 5వేల లోపు 24మంది, 10వేల లోపు 36మంది, 20వేల లోపు 54మంది ర్యాంకులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా కె.శ్రీ ప్రియతమ్ 371వ ర్యాంకు సాధించి కళాశాల అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఎస్.గోకుల్ కిషోర్ రెడ్డి 882వ ర్యాంకు, ఎమ్. నవదీప్ 984వ ర్యాంకు, జి.హేమసాయి 1234వ ర్యాంకు, కె.షారోన్ పెర్సిస్ 3355వ ర్యాంకులు సాధించారన్నారు. బై.పి.సి విభాగంలో 5వేల లోపు 5గురు, 10 వేల లోపు 11 మంది, 15వేల లోపు ర్యాంకులు 20 మంది సాధించారన్నారు. హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి, విద్యార్థులను అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

రెజొనెన్స్ విజయఢంకా


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల బృందం

ఖమ్మం ఖానాపురంహవేలి మే 18: తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాలల్లో రెజొనెన్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఖమ్మం జిల్లాలోనే అగ్రగామిగా నిలిచారని కళాశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావులు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో బి. కిరణ్ కుమార్ రెడ్డి 1,541, ఎం. సాయి శ్రీ హర్ష 2,205, కె. యశ్వంత్ 3699, పి. అంకుష్ వర్మ 4,413. పి. నిఖిల్ సాయి 4,451, డి. శ్రవిష్ఠ 4,739, ఎం. సాయి లక్ష్మీ అంకిత 5,389, ఎ.జీవన్ కుమార్ 7,295, వంటి ర్యాంకులు సాధించారని తెలిపారు. అగ్రీకల్చర్ విభాగంలో గాదె. హారిక 2543, వై.లిఖిత 4,527, ఎ.సాయి ప్రగ్న్య 7,777, ఎండి. పర్వీన్ బేగం 8,405, వంటి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్స్ మాట్లాడుతూ ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధనానుభవం కలిగిన యాజమాన్యమే ఈ విజయానికి కారణమని అన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి అధ్యాపకులు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ అన్యాయాన్ని ప్రశ్నించిన వ్యక్తి తీన్మార్ మల్లన్న

● టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్


తీన్మార్ మల్లన్నతో భద్రాచలం కాంగ్రెస్ నాయకులు

భద్రాచలం, మే18: బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు చేసిన అన్యాయాలను ప్రశ్నించిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ అన్నారు. శనివారం వరంగల్‌లో తీన్మార్ మల్లన్నను భద్రాచలం కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మల్లన్న భద్రాచలం నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా కృషి చేయాలని వారిని కోరారు.

సైబర్ క్రైంపై అవగాహన సదస్సు

ఖమ్మం లీగల్ మే 18: జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఆదేశాల మేరకు శనివారం న్యాయసేవాసదన్‌లో న్యాయశాఖ ఉద్యోగులకు సైబర్ క్రైం అనే అంశంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. సైబర్‌క్రైం ఏసీపీ ఫణీందర్ ఆధ్వర్యంలో న్యాయశాఖ ఉద్యోగులకు అంతర్జాల నేరాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకోర్టు నాజర్ రాధేశ్యామ్, సాంకేతిక అధికారి ఎస్.ఓంకార్, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

21న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, మే 18: జిల్లా క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 21న నగరంలోని పెవీలియన్ గ్రౌండ్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. జగన్మోహన్‌రావు, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకట్, కో-ఆర్డినేటర్ మసూద్, మేనేజర్ పారూఖ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఏ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగుస్తున్నందున ముందుగా అంగీకరించిన విధంగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి ఈనెల 24 నుంచి 30 వరకు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనున్న అంతర జిల్లాల టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన ఏర్పాట్లతో పాటు రవాణా చార్జీలను చెల్లిస్తామని పేర్కొన్నారు. ఎంపికలలో 25 ఏళ్ల లోపు క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 98486 62125 నెంబరును సంప్రదించాలని కోరారు.

108లో ప్రసవం

ములకలపల్లి, మే 18: మండలంలోని ఊకే రామవరానికి చెందిన మిడియం లక్ష్మి శనివారం 108లో ప్రసవించింది. రామవరానికి చెందిన మిడియం లక్ష్మి పురుటినొప్పులతో బాధపడుతూ 108కి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవించింది. తల్లి, మగబిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. 108 పైలెట్ అశోక్, ఈఎంటీ భాగ్యమ్మను గ్రామస్థులు అభినందించారు.

'బీమా పాలసీని వర్తింప చేయాలి'


న్యాయశాఖ కార్యదర్శి తిరుపతికి వినతి పత్రం అందిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్ మే 18: మే నెలతో కాలపరిమితి తీరబోతున్న అడ్వకేట్స్ గ్రూప్ బీమా పాలసీని 2019 సంవత్సరం తరువాత వృత్తిలోకి వచ్చిన యువ న్యాయవాదులకు కూడా వర్తింపచేసి హెల్త్‌కార్డులు జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎల్‌యు ప్రతినిధి బృందం శనివారం న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి ని రాష్ట్ర సచివాలయంలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2024-2025 సంవత్సరానికి కొత్త గ్రూప్ బీమా పాలసీకి న్యాయవాదుల జాబితాను సరిచేయాలని కోరారు. ప్రతినిధి బృందంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐఎల్ యూ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.విద్యాసాగర్, అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, కోశాధికారి వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు చందాల శైలజ, ఏడునూతల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్ మక్కడ్, కిషన్‌రావు, శంకరయ్య, మంజులత ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

కరకగూడెం, మే18: మండలంలోని కలవల నాగరాం గ్రామంలో శనివారం కరకగూడెం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇటీవల కరకగూడెంలో 'గుప్పుమంటున్న గుడుంబా' అనే కథనంపై స్పందించిన ఎస్ఐ గుడుంబా స్థావరాలపై ఈ దాడులను చేపట్టారు. ఈ సందర్భంగా గుడంబాను, బెల్లం పానకాన్ని పారపోశారు. పోలీసులు వస్తున్నట్లు గమనించిన గుడుంబా తయారీదారులు పరార్ అయ్యారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసు సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత


ఆళ్లపల్లి, మే 18: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు పోలీసులు అందజేశారు. ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాపురం గ్రామానికి చెందిన శివకుమార్, ఆళ్లపల్లికి చెందిన జహీర్ అనే ఇద్దరు యువకులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ టెక్నాలజీని ఉపయోగించి పోయిన ఫోన్లను పట్టుకుని శనివారం ఆయా యువకులకు ఎస్ఐ రతీష్ అందజేశారు.

పెనుబల్లి ఆసుపత్రి యూడీసీపై విచారణ

పెనుబల్లి, మే 18: పెనుబల్లి ఆసుపత్రిలో యూడీసీగా పనిచేస్తున్న శ్రీధర్‌పై స్థానిక ఉద్యోగులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఇటీవల ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు శనివారం డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది నుంచి ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను తీసుకున్నారు. యూడీసీ శ్రీధర్ ఖమ్మం నుంచి వారానికి రెండురోజులే ఆసుపత్రికి వస్తూ ఉద్యోగుల జీతాలకు సంబంధించి బిల్లులు చేసినందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, తమకు హాజరు వేయకుండా వేధింపులకు గురిచేస్తున్నాడని ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ జరిపిన డీసీహెచ్ఎస్ బాధితుల నుంచి వివరణ తీసుకొని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులతో సమావేశాన్ని నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. రూ.ఏడున్నరకోట్లతో చేపట్టిన నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ వరుణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ హామీతో రోడ్డు సౌకర్యం

» ఎస్ఐ రతీష్‌కు అభినందనలు తెలిపిన రాయిగూడెం గ్రామస్థులు


ఊరవాగుపై జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎస్ఐ రతీష్

ఆళ్లపల్లి, మే 18: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాయిగూడెం గ్రామస్థులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ మాట నిలబెట్టుకున్నారు. ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆళ్లపల్లి మండల పరిధిలోని రాయిగూడెం గ్రామస్థులు ప్రభుత్వం తమ గ్రామానికి రోడ్డు, ఇతర సౌకర్యాలు కల్పించడం లేదని ఎన్నికలు బహిష్కరించారు. రాజకీయనాయకులు ఇచ్చిన హామీతో పాటు ఎస్ఐ రోడ్డు పనులు చేస్తామని, ఓట్లు వేసేందుకు రావాలని హామీ ఇచ్చారు. హామీతో గ్రామస్థులు ఓట్లు వేశారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లా పోలీస్ అధికారుల సలహాలతో ఎస్ఐ, ఆర్అండ్‌బీ సహకారంతో రెండు రోజులుగా బాటన్ననగర్ నుంచి రాయిగూడెం వెళ్లే మార్గంలోని ప్రధానంగా ఉన్న సమస్య ఊరవాగుపై తాత్కాలికంగా పైపులతో రోడ్డు పనులు పూర్తి చేయించారు. దీంతో గ్రామస్థులు ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్, జిల్లాపోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

» వీడియోకాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), మే 18 : గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో వచ్చే జూన్ 9న నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్షకు చేపట్టనున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పరీక్ష నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి జిల్లాకు పరీక్షల నిర్వహణకు ఒక రీజనల్ కోఆర్డినేటర్‌ను నియమించినట్లు తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు, రీజనల్ కోఆర్డినేటర్లు జాయింట్ కస్టోడియన్ గా ఉంటారని, వీరికి పోలీసు నోడల్ అధికారి సహకరిస్తారని అన్నారు. ప్రతి సెంటర్‌కు ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించాలని, తహసీల్దార్ స్థాయి అధికారిని ఫ్లైయింగ్ స్క్వాడ్ గా, ప్రతి వంద మంది అభ్యర్థులకు ఒక ఐడెంటిఫికేషన్ అధికారిని నియమించాలని తెలిపారు. ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేయాలని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ఎవరూ కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు, గాడ్జెట్స్, సెల్ ఫోన్స్ వెంట తీసుకు రాకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని, పరీక్ష రోజు 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలని, అన్ని జిరాక్స్ షాపులు బంద్ చేసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష రోజు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం అదనంగా, ప్రత్యేక ఆర్టీసీ. బస్సులు నడపాలన్నారు. తాగునీటి సౌకర్యం, కనీస మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలన్నారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షా కేంద్రం ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు బయోమెట్రిక్ ఉంటుందని, సిబ్బందికి బయోమెట్రిక్ తీసుకునే విధానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో రెండు రోజుల ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్లకు, సెంటర్ అబ్జర్వర్లకు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు, పోలీస్ నోడల్ అధికారులకు ఈనెల 22న హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్టీయూ కాంప్లెక్స్ బయోమెట్రిక్ విధానంపై శిక్షణ అందిస్తామని తెలిపారు. జూన్ 9న ఉదయం 10-30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను బయోమెట్రిక్ హాజరు దృష్ట్యా ఉదయం 9-00 గంటల నుంచే కేంద్రాల్లోనికి అనుమతించనున్నట్లు చెప్పారు. 10 గంటలకు గేట్లు మూసివేయాలని, ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించడం కుదరదన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టిక్కెట్ తో పాటు ఫోటో ఐడెంటిటీ కార్డు తీసుకురావాలని చైర్మన్ అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక అల మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 18: భద్రాచలంలోని సీతా రామచంద్రస్వామి వారికి శనివారం సందర్భంగా ఆర్జిత సేవలో భాగంగా అంతరాలయంలో స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్య కల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా సత్తుపల్లి మండలం రేచర్లకు చెందిన కొప్పుల రాఘవ రెడ్డి, సత్యవతి దంపతులు నిత్యన్నదాన పథకంకు రూ1,01,116 విరాళంగా అందజేశారు.

భద్రాద్రిలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

భద్రాచలంలో జూన్ ఒకటిన హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఉదయం ఆంజనేయస్వామికి అభిషేకం, తమలపాకుల సేవ ఉంటుంది. అలాగే రాత్రి 8 గంటలకు ఆంజనేయస్వామి వారికి తిరువీధి సేవ, విశేష భోగ నివేదన వంటి పలు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉదయం నుంచి సుందరకాండ పారాయణాన్ని పండితులచే నిర్వహించనున్నారు. అలాగే హనుమద్దీక్షితులకు, భక్తులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మంచినీరు, మజ్జిగ వితరణ చేయనున్నారు. అదేవిధంగా రాజగోపురం ఎదురుగా, తూర్పుమెట్ల వైపున నాలుగు ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బస్సు నుంచి జారి పడి మహిళ దుర్మరణం


అనూష

కొణిజర్ల, మే18: ఖమ్మం జిల్లా కొణిజర్లలో శనివారం ఆర్టీసీ బస్సు ఎక్కిన రెండు నిమిషాల్లోనే జారిపడి, అదే బస్సు వెనుక టైరు కిందపడి ఓ మహిళ దుర్మరణం పాలైంది. ఎస్ఐ శంకర్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం.. కొణిజర్ల మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామానికి చెందిన దూరి అనూష(26) ఖమ్మంలోని ఓ మార్టులో పని చేస్తోంది. రోజు వారిలాగే శనివారం ఉదయం పెద్దమునగాలలో బయలుదేరిన అనూష కొణిజర్లకు చేరుకుంది. కొణిజర్ల సెంటర్‌లో భద్రాచలం నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసి బస్సును ఎక్కింది. బస్సు సెంటర్ నుంచి మండలపరిషత్ కార్యాలయం వరకు రాగానే బస్సు డ్రైవర్ ఎదుటివాహనాన్ని తప్పించేందుకు బ్రేకు వేశాడు. అప్పుడే ఎక్కిన ఆమె డోర్ వద్ద ఉండటంతో బస్సుడ్రైవర్ వేసిన బ్రేకుకు జారి మెట్ల నుంచి బస్సు వెనుకటైర్ కింద పడింది. బస్సుటైర్ ఆమె పై నుంచి వెళ్లటంతో నడుము భాగం నుజ్జు నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతిచెందింది.

ఎస్ఐ అక్కడకు చేరుకొని బస్సును స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. మృతురాలి భర్త, ఆమె తల్లి, సోదరుడు బంధువులు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. మృతురాలి తల్లి విలపిస్తున్న తీరు అందరికి కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ ద్వారా ఖమ్మం మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలికి భర్త అశోక్, చిన్నారులు మనస్వీత, వినన్య ఉన్నారు.

రెండు జీవితాల్లో విషాదాన్ని మిగిల్చిన సరదా!


» స్నేహితుడి అనారోగ్యానికి కారణమయ్యాయని మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

» ఆసుపత్రిలో చావు బతుకల నడుమ పోరాడుతున్న మరోకరు


నాగయ్య మృతదేహం

బోనకల్, మే 18: ఇద్దరు మంచి స్నేహితులు..కష్టపడి పని చేసుకుంటూ ఉన్న దానితో హాయిగా గడిపేస్తున్నారు. కాని అనుకోని విధంగా వారి జీవితాలల్లో విషాదాన్ని మిగిల్చింది సరదా. ఒకరి పక్కన మరోకరు కూర్చోని నవ్వుకుంటూ చేసుకున్న హాస్యం వారికి శాపంగా మారింది. ఈ క్రమంలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరోకరు ఆసుపత్రిలో చావు, బతుకుల నడుమ పోరాడుతున్న సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.

పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన తేరాల నాగయ్య(48)కు ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేయడంతో పాటు కల్లు గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన గుడిదె శ్రీనివాసరావు కూడా కల్లు విక్రయిస్తుంటాడు. ఇద్దరు స్నేహితులు కావడంతో గ్రామంలోని ప్రధాన రోడ్డు వెంట కల్లు పెట్టుకొని విక్రయించేవారు. రెండు నెలల క్రితం ఇద్దరూ మోరిపై కూర్చోని సరదాగా ఆట పట్టించుకునే క్రమంలో శ్రీనివాసరావు కాళ్లను నాగయ్య పైకి లేపాడు. వెనుక నుంచి కింద పడటంతో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు కావడంతో వారి కుటుంబం అప్పుల పాలైంది. ఈ సంఘటన గురించి నాగయ్యపై బాధిత కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. రిమాండ్ నుంచి బయటకు వచ్చిన తరువాత కోర్టు వాయిదాలకు తిరుగుతున్నాడు. స్నేహితుడికి ఆసుపత్రిలో అయినా ఖర్చులను ఇచ్చేందుకు నాగయ్య సుముఖంగా ఉండగా, వారి కుటుంబంలో అభిప్రాయ భేదాలు తలెత్తాయి. నాగయ్య, కొన్ని రోజుల పాటు తన భార్యతో పాటు ముదిగొండ మండలంలో ఉన్న అత్తారింటికి వెళ్లాడు. పది రోజుల క్రితం బ్రాహ్మణపల్లికి వచ్చాడు. సరదా తమ జీవితాలను ఛిద్రం చేసిందని, కనీసం స్నేహితుడికి వైద్యం చేయించేందుకూ కూడా తాను డబ్బులివ్వలేని పరిస్థితి దాపురించిందన్న మనస్తాపంతో శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగువారు చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బిలీఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



ఖమ్మంకలెక్టరేట్, మే18: లీఫ్‌చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో బిలీఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం బాలపేట పాఠశాలలో మెగాహెల్త్‌క్యాంపు నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మేడింపూడి రమాజ్యోతి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ఇలాంటి శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆస్పత్రి ఎండీ రమాజ్యోతి కోరారు. ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆమె ప్రజలకు తెలిపారు. సుమారు 7వందల మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

మురుగు తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్

- ఖమ్మం నగరపాలకసంస్థ అదనపు సిబ్బంది నియామకం
- వర్షాకాలం దృష్ట్యా పనులు

ఖమ్మంకార్పొరేషన్, మే18: నగరంలో మేజర్ డ్రెయినేజీ కాలువల మురుగు తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. వర్షాకాలం నేపథ్యంలో దృష్ట్యా సదరు కాలువల్లో వరదనీరు ప్రవహించేలా మురుగును తొలగించేందుకు శనివారం నుంచి నగర పాలకసంస్థ అధికారులు ప్రారంభించారు. అంతకుముందే ఎక్కడ సమస్య ఉందో అధికారులు గుర్తించారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తరువాత పనులు చేపడదామని ప్రణాళిక వేశారు. శనివారం నగర పాలకసంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో వైరారోడ్ సమీపంలో మురుగు తొలగింపు పనులను ప్రారంభించారు. మురుగుతొలగింపు ప్రత్యేక డ్రైవ్‌కు అదనపు సిబ్బందిని నగర పాలకసంస్థ అధికారులు నియమించారు. నగర పాలకసంస్థలోని పారిశుధ్య సిబ్బందితో కలిసి అదనపు సిబ్బంది పని చేస్తారు. మొత్తం 100 మంది అదనపు సిబ్బందిని తీసుకోవాలని అనుకున్నారు. ప్రస్తుతం 30 మందిని తీసుకున్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని 60డివిజన్లలో భారీగా మురుగు పేరుకుపోయిన డ్రెయినేజీలను గుర్తించటంతో దశలవారీగా మురుగు తొలగించనున్నారు. ఇందుకోసం జేసీబీలను ఏర్పాటు చేశారు. చిన్నవర్షం పడినా నగరంలో వరదనీరు వెళ్లే మార్గంలేక కాలువలు నిండి, మురుగు, వరదనీరు రహదారులపై ప్రవహించేంది. ఇప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేసి, పేరుకుపోయిన మురుగును తొలగించే ప్రత్యేక డ్రైవ్ చేపట్టడంతో వర్షాకాలంలో వరదనీరు రహదారులపై చేరకుండా సదరు కాలువల నుంచే ప్రవహించే అవకాశం ఉంది.



వైరారోడ్ సమీపంలో మురుగు తొలగిస్తున్న సిబ్బంది

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ వితరణ

ఖమ్మంసాంస్కృతికం, మే18: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో శనివారం చినకోరుకొండి గ్రామానికి చెందిన మహిళకు కుట్టుమిషన్‌ను ఖమ్మంలో బహూకరించారు.. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శి వేముల హనుమంతరావు, జోన్ చైర్మన్ డిపీసీ రావు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ మంచినీటి సరఫరా బంద్

ఏన్కూరు,మే18: మండలంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా శుక్రవారం నుండి నిలిచి పోయింది. 25 గ్రామపంచాయతీలోని ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జీఎల్‌బీఆర్ మెయిన్‌లైన్ గూడూరు పన్లాంట్ పంపింగ్ లైన్‌లో ఏర్పడిన లీక్‌ను త్వరితగతిన పూర్తి చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్తులు సంబంధిత అధికారులును కోరుతున్నారు.

హైవే నిర్మాణ పనులను అడ్డగించిన రైతులు

ముదిగొండ, మే 18: ముదిగొండ వద్ద చేపడుతున్న కోదాడ-కొరివి హైవే నిర్మాణ పనులను శనివారం రైతులు అడ్డుకున్నారు. గతంలో హైవే నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు రైతుల విజ్ఞప్తి మేరకు అండర్‌పాస్ ఇస్తామని చెప్పారని ఇవ్వకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిగొండ చెరువు నుంచి వెళ్లే తూమును కూడా పూడ్చి హైవే నిర్మాణం చేపడుతున్నారని, తూము పూడ్చివేయడం వల్ల వరదతో పైన ఉన్న పొలాలు ముంపుకు గురయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు మంకెన దామోదర్, యలమద్ది శ్రీను, స్వరాజ్, మందరపు ఉపేందర్, వడ్డెం రవి, గుర్రం వెంకయ్య, రమేష్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో ఆరాధన పూజలు

ముదిగొండ,మే18: ముదిగొండలోని శ్రీవిరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం వైశాకశుద్ధ దశమిరోజు వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి చేసిన సందర్భంగా ఆరాధన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు దిగుట్ల భద్రయ్యాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మహిళాశక్తి కుట్టు కేంద్రాల ప్రారంభం



కల్లూరు, మే18: మండలంలోని పలు గ్రామాల్లో ఉషోదయ మహిళ సమైఖ్య ఆధ్వర్యంలో శనివారం మహిళశక్తి కుట్టు కేంద్రాలను ప్రారంభించారు. సర్కారు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫామ్ దుస్తులను (కుట్టేందుకు) తయారు చేసేందుకు ఐకేపి తరుపున ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాలను డీఆర్‌డీఏ డీపీఎం హెచ్‌డి దర్గయ్య, తహసీల్దార్ పి.సాంబశివుడు సందర్శించారు. మండలంలోని పాయాపూరు, చెన్నూరు, కల్లూరులోని ఉషోదయ సమైఖ్య కార్యాలయంలో మహిళ శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని 2,817 మంది విద్యార్థులకు ఒక జత పాఠశాల యూనిఫామ్ దుస్తులు ఈ కేంద్రాల్లో సిద్ధమవుతున్నాయని ఏపీఎం వెంకటరామారావు తెలిపారు.

కారు ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

వైరా, మే18: మండలంలోని రెబ్బవరం-గొల్లపూడి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై కారు ఢీకొని ఓ ద్విచక్రవాహన చోదకుడికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఈ సంఘటన జరిగింది. గొల్లపూడి గ్రామానికి చెందిన రాపాల నర్సింహారావు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గొల్లపూడి నుంచి వైరా వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న నర్సింహారావును వెనుకనుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొట్టింది.

ఎప్‌సెట్ ఫలితాల్లో విద్యాభారతి టౌన్‌ఫస్ట్



సత్తుపల్లి,మే18: శనివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాలలో సత్తుపల్లి పట్టణంలోని విద్యాభారతి కళాశాల విద్యార్థి కే.హేమచంద్ర బాలాజీ 2170ర్యాంక్ సాధించి టౌన్‌ఫస్ట్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ జీవీ.లింగారెడ్డి తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల డైరెక్టర్ ఎం.సత్యనారాయణ, అధ్యాపకబృందం అభినందించారు.

పట్టభద్రుల ఎన్నికలకు సిద్ధంకండి

సత్తుపల్లి, మే18: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధమవ్వాలని అధికారులకు కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్ సూచించారు. శనివారం ఆయన సత్తుపల్లిలోని పలు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ కే.యోగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. పలు సూచనలు చేశారు. ఆయన వెంట గిర్ధావర్లు నరేష్, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న ను గెలిపించాలి

మధిరటౌన్, మే18: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కోరారు. శనివారం మధిర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల వారిగా ఉన్న ఓటర్లను కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేవేసేలా ప్రచారం నిర్వహించాలని, మొదటి ప్రాధాన్యత ఓటును మల్లన్నకు వేసేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, కర్నాటి రామారావు మొండితోక సుధాకర్, నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, జహంగీర్, చావలి రామరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

మధిరటౌన్,మే18: శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఎన్నికల మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవకి వాసుదేవరావు కోరారు. శనివారం మధిరలోని జరిగిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏలూరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, పాపట్ల రమేష్, చిలువేరు సాంబశివరావు, రామిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల ఓటర్ల స్లిప్పుల పంపిణీ పూర్తి

బోనకల్,మే18: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల స్లిప్పుల పంపిణీని బీఎల్వోల ద్వార పూర్తి చేశామని తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. బోనకల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను ఆయన శనివారం పరిశీలించారు. మండలంలో మొత్తం 1971 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ నెల 27వ తేదిన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటున్నందున గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగుల ప్రాణాలు బలిగొన్న బీఆర్ఎస్



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి, లక్ష్మణ్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే18: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల ప్రాణాలను బలిగొందని, వారి కుటుంబాలతో చెలగాటమాడిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిని ప్రశ్నించి అక్రమ కేసులకు గురైన ఖమ్మం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సతుకు ప్రవీణ్, మడుపల్లి లక్ష్మణ్, వెంకటేష్, మధు, శివ, చందులాల్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో వెలాసిటీ ర్యాంకుల ప్రభంజనం



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి, మే18: శనివారం ప్రకటించిన ఎప్‌సెట్ 2024 ఫలితాల్లో నగరంలోని వెలాసిటి జూనియర్ కళాశాలకు చెందినా రెగ్యులర్, షార్ట్ టర్మ్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులు అత్యుతమ ర్యాంకులు సాధించారని కళాశాల అకడమిక్ డీన్ మహ్మద్ యాకూబ్, చైర్మన్. శెట్టి లక్ష్మణ్‌రావు తెలిపారు. వీరిలో పి.రమాదేవి 3,396, కె.అనుష 4,679,సీహెచ్ లాస్య 4,866, వి వాణి 4,957, డి రాహుల్ 5,968, వి. నిఖిలేష్ 6,356, ఎస్ కె.సోహన్ అఫ్రోజ్ 6,926, ఎల్. హేమంత్‌సాయి 7,564, ఆర్ జస్వీత్‌కుమార్ 8,245, వి.రజిని 9,456, ఎండి హసీనా 10,432, ఎస్ లక్ష్మీ నవ్యశ్రీ 11,850 తోపాటు మరెందరో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. 53 మంది విద్యార్థులు 50 వేలలోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరిని కళాశాల అకడమిక్ డీన్ మహ్మద్ యాకూబ్, చైర్మన్. శెట్టి లక్ష్మణ్‌రావు, కరస్పాండెంట్. మల్లోలు రవి, ప్రిన్సిపాల్స్ సి.హెచ్ వెంకట్, తోట శ్యామ్ అధ్యాపక బృందం అభినందించారు.

ఉపకార వేతనాలకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మంకలెక్టరేట్,మే18: 2024-25 సంవత్సరానికి జిల్లాలోని విదేశాల్లో చదివే గిరిజన విద్యార్థులు ఉపకార వేతనానికి మే 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎన్. విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్ స్థాయి పీహెచ్‌డీ పోస్ట్, డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాంల్లో చదవాలనుకునే వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 31లోగా హెచ్‌టీటీపీఎస్:// ఓటీఈఆర్ఎస్ఈపీఎస్.టీఆర్ఐబీఏఎల్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగిరం చేయాలి

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం కలెక్టరేట్, మే18: పాఠశాలల పునః ప్రారంభం లోగా అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం క్రింద 753 పాఠశాలలు రూ. 2138.623 లక్షల వ్యయ అంచనాలతో పనులు చేపట్టినట్లు తెలిపారు.ఇప్పటికి 226 పాఠశాలల్లో పనులు పూర్తి చేశామన్నారు. 425 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉండగా, 102 పాఠశాలల్లో పనులు ఇంకా ప్రారంభించలేదన్నారు. పురోగతిలో ఉన్న పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు ప్రారంభించని పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించి వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీసీఈవో పి.వినోద్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళీశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, పీఆర్ ఈఈలు వెంకటరెడ్డి, కెవికె. శ్రీనివాస్, ఈఈ టిడబ్ల్యూ ఐడీసీ నాగశేషు, మండల విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ శాఖల అధికారుల పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

గీతామందిరంలో బ్రహ్మోత్సవాలు



సత్తుపల్లిరూరల్,మే18: సత్తుపల్లి గీతాజ్ఞానమందిరంలో బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారధి స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. యజ్ఞాచార్యులు శ్రీమాన్ ప్రతాపురం గిరిధరా చార్యులు, అర్చక స్వామి అమరవాది కృష్ణ చైతన్యాచార్యులు ఆధ్వర్యంలో బ్రహోత్సవాలు సాగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ వీరరాఘవ వెంకటేశ్వరావు, కొత్తూరు రాజేశ్వరరావు, బాల లీలా కృష్ణారావు, ఏపూరు పురుషోత్తం, తాటికొండ వెంకటేశ్వరరావు, కొత్తూరు ప్రభాకరరావు, తిరునగరి వెంకట నర్సయ్య చక్రధర్, నాగుబండి భాస్కరరావు, వనమా నరేష్, దాసరి రాఘవయ్య గుడిమెట్ల తులసీ ప్రసాద్, నాగరపు సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా రెండోరోజు పూజలు

మధిరటౌన్,మే18: మధిర బంజారా కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ 15వ వార్షిక బ్రహోత్సవాలలో బాగంగా రెండో రోజు శనివారం దేవాలయంలో పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. యాగశాలలో పలువురు దంపతులు కూర్చొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారు అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె గా అందంగా అలంకరించి, ఊరేగించారు.

గార్లొడ్డు దేవస్థానంలో ఉత్సవాలు ప్రారంభం

ఏన్కూరు, మే18: జిల్లాలోనిప్రముఖ పుణ్యక్షేత్రమైన గార్లొడ్డు శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి దేవస్థానం కల్యాణం బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 25వరకు ఈ వేడుకలు జరుగుతాయని ఈవో ఎన్.శేషయ్య తెలిపారు. 23న స్వామివారి కల్యాణ మహోత్సవం, 24న స్వామివారి తిరువీధి ఉత్సవం ఊరేగింపు, 25న చక్రస్నానం, నివేదన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమంతో ముగుస్తాయి. ఈకార్యక్రమానికి దాత జాలాది దొరబాబు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు.

వెండి కిరీటం పాదుకల వితరణ



వెండికిరీటం పాదుకలను అందజేస్తున్న నరేష్,ప్రవళిక దంపతులు

కొణిజర్ల,మే18: మండల పరిధిలోని తుమ్మలపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి గ్రామానికి చెందిన బెజవాడ నరేష్ - ప్రవళిక దంపతులు రూ.1,20,000 విలువ గల వెండికిరీటం పాదుకలను బహూకరించారు. శనివారం ఆలయంలో స్థానిక ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో పూజారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దండు దేవదాస్, వైస్‌చైర్మన్ వేముల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కమటాల రేణుక, నరేష్ కుటుంబసభ్యులు బెజవాడ వెంకటనారాయణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జమలాపురానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి నివేదనకు పొంగళ్లను సిద్ధం చేస్తున్న మహిళలు

ఎర్రుపాలెం మే 18: జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. నాలుగు వారాలుగా వెలవెలబోయిన ఆలయం, ఒక్కసారిగా భక్తజనంతో పోటేత్తింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంద ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శనివారం ప్రత్యేకంగా ముత్యాల కవచ అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణవేదిక వద్దకుచేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉప ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, అర్చకులు సుదర్శన్‌శాస్త్రి, రాజీవ్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ ఇ.కృష్ణప్రసాద్, సిబ్బంది సాయ, వంశీ, విజయ్, మారుతిరావు, విజయ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీరు వృథా

కారేపల్లి, మే18: మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో గల భూపతిరాయు చెరువు నీరు వృథాగా పోతోంది. తూములకు సరైన మరమ్మతులులేక పోవడం, షటర్లు లేకపోవడంతో రెండు రోజుల కితం కురిసిన వర్షానికి వచ్చిన వరదనీరు వృథాగా పోతోంది. గత ఏడాది చెరువులోని నీరువృథాగా పోయిందని రైతులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఐనప్పటికీ వారు చేసినపట్టించుకోలేని వారు చెబుతున్నారు. దీంతో రైతులు మరమ్మతులు చేసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువులోకి నీరు చేరుతున్నాయని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



కన్యకాపరమేశ్వరి జయంతి

ఖమ్మంసాంస్కృతికం, మే18: ట్రంకు రోడ్డులోని మాతా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి.. ఆలయ చైర్మన్ యర్రం బాలగంగాధర్ తిలక్ అమ్మవారి త్యాగ విశిష్టతను వివరించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

తల్లాడ, మే18: స్థానిక బాల భారతి విద్యాలయంలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2004పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నాటి గురువులను సన్మానించారు.

నేలకొరిగిన సిగ్నల్ లైట్



వైరా, మే18: వైరాలోని క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు ఢీకొని రెడ్ సిగ్నల్‌లైట్ స్తంభం కూలిపోయింది. 20 రోజుల కిందట ఈస్తంభం పడిపోయి నప్పటికీ ఇంతవరకు పునరుద్ధరించలేదు. వైరాలోని క్రాస్ రోడ్డు వద్ద మధిర-జగ్గయ్యపేట రోడ్డులో ఉన్న రెడ్‌సిగ్నల్ లైట్‌స్తంభాన్ని గుర్తుతెలియని వాహనాలు ఢీకొట్టడంతో పడిపోయింది. జగ్గయ్యపేట, మధిర నుంచి వైరాలో జాతీయ ప్రధాన రహదారిపైకి వాహనాలు ఎక్కే ముందు భాగంలో ప్రమాద హెచ్చరికలతో జాతీయ ప్రధాన రహదారి అధికారులు రెడ్ సిగ్నల్ లైట్‌ను ఏర్పాటుచేశారు. సోలార్ సిస్టమ్‌తో ఈ రెడ్‌సిగ్నల్ లైట్ వాహనదారులకు హెచ్చరికలను ఇస్తుంది. జాతీయ ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నందున ఈ రోడ్డుమీదకు వెళ్లే సమయంలో పరిమిత వేగంతో ఆగి ముందుకు సాగాలని హెచ్చరిస్తూ ఈ రెడ్‌సిగ్నల్ లైట్ అమర్చారు. పదిరోజుల కిందట తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని స్తంభం నేలకొరిగిపోయింది. అయినప్పటికీ దీని గురించి ఇంతవరకు ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పడిపోయిన రెడ్‌సిగ్నల్ లైట్‌ను తిరిగి పునరుద్ధరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.